నవగీతం
తెలుగు దినపత్రిక
శుక్రవారం
5 జూన్ 2026

# గ్రామపంచాయతీల్లో సమాచార సేవల పరికరాల చోరీల ముఠా గుట్టురట్టు

**రూ.4.52 లక్షల విలువైన పరికరాలు స్వాధీనం -- ముగ్గురు అరెస్టు**

**నవగీతం, జూన్04,(జగిత్యాల ప్రతినిధి) :** గ్రామపంచాయతీ భవనాల్లో ఏర్పాటు చేసిన సమాచార సేవల పరికరాలను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్న ముఠాను జగిత్యాల రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా, వారి వద్ద నుంచి సుమారు రూ.4.52 లక్షల విలువైన బ్యాటరీలు, నిరంతర విద్యుత్ సరఫరా పరికరాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన పలు చోరీ కేసుల దర్యాప్తులో భాగంగా గురువారం ఉదయం ధరూర్ గ్రామ శివారులోని జగిత్యాల బైపాస్ రోడ్డుపై అంబేద్కర్ విగ్రహం సమీపంలో ప్రత్యేక వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా వెళ్తున్న ఒక ఆటోను ఆపి తనిఖీ చేయగా, అందులో భారీ సంఖ్యలో బ్యాటరీలు, విద్యుత్ సరఫరా పరికరాలు కనిపించాయి. వెంటనే ఆటోలో ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా, గ్రామపంచాయతీ భవనాల్లోని సమాచార సేవల కేంద్రాల నుంచి పరికరాలను చోరీ చేసినట్లు అంగీకరించారు. విచారణలో ప్రధాన నిందితుడు బండ అంజయ్య గతంలో సంబంధిత సంస్థలో వాహనచోదకుడిగా, అనంతరం సాంకేతిక సిబ్బందిగా పనిచేసినట్లు తెలిసింది. ఉద్యోగం మానేసిన తర్వాత గ్రామపంచాయతీ భవనాల్లో ఏర్పాటు చేసిన బ్యాటరీలు, విద్యుత్ సరఫరా పరికరాలను దొంగిలించేందుకు పథకం రచించి, తన సహచరులు



మండలి రవి, చెమేల్ల నరేష్‌లతో కలిసి చోరీలకు పాల్పడినట్లు వెల్లడైంది. గత నెల రోజులుగా ధర్మారం, లక్ష్మీపూర్, తిమ్మాపూర్, కల్లెడ, సంగంపల్లి, హన్మాజీపేట, అనంతారం, గుట్రాజ్‌పల్లి, అంతర్గాం, గొల్లపల్లి తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన పరికరాలను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. దొంగిలించిన సామగ్రిని ఒకచోట నిల్వ ఉంచి విక్రయించేందుకు తరలిస్తున్న సమయంలో పోలీసులు పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. అరెస్టు చేసిన నిందితులు బండ అంజయ్య (36), మండలి రవి (49), చెమేల్ల నరేష్ (38) లక్ష్మీపూర్ గ్రామానికి చెందినవారని పోలీసులు వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి 39 బ్యాటరీలు, నాలుగు నిరంతర విద్యుత్ సరఫరా పరికరాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన పోలీసు బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి.. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

## తుంగూర్ ప్రత్యేక గ్రామసభలో అదనపు కలెక్టర్ బి.ఎస్. లత

**నవగీతం,జూన్04,( జగిత్యాల ప్రతినిధి) :** జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించడంతో పాటు మిల్లులకు చేరిన ధాన్యాన్ని 24 గంటల్లోపు అన్లోడింగ్ చేయాలని సూచించారు. గురువారం బీర్‌పూర్ మండలంలోని మోతీనగర్ గ్రామంలో ప్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రం, నరసింహులపల్లి, కందెనకుంట గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కొనుగోలు కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు ప్రక్రియను పరిశీలించి హమాలీలు తగిన సంఖ్యలో అందుబాటులో ఉండేలా చూడాలని, ధాన్యం లోడింగ్ పనులను వేగవంతం చేసి లారీలను ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించాలని అధికారులకు సూచించారు. ట్రక్ షీట్ నమోదు, ట్యాబ్ ఎంట్రీలు తదితర డాక్యుమెంటేషన్ పనులను సకాలంలో పూర్తి చేయాలని, ఎలాంటి పెండింగ్‌లు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకత పాటిస్తూ రైతులకు సరైన సమాచారం అందించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు సమయంలో తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పరిశీలించాలని, రైతుల ప్రయోజనాలకు భంగం కలిగించే అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను హెచ్చరించారు. అకాల వర్షాలను దృష్టిలో




ఉంచుకుని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తగిన రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామంలో ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో పాల్గొన్న అదనపు కలెక్టర్, ప్రజల నుంచి వచ్చిన వినతులను పారదర్శకంగా పరిష్కరించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అటవీ సంరక్షణ నీటి కాలుష్యంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



**నవగీతం, జూన్04,(రాయికల్ ప్రతినిధి)** నీటి కాలుష్యంపై విద్యార్థులకు గురువారం ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అటవీ కార్యాలయం రాయికల్ నందు అటవీ క్షేత్ర అధికారి రాయికల్ ఎన్విరాన్మెంట్ నీటి వాయువు కాలుష్యం వాటి పరిణామాలు మరియు నియంత్రణ గురించి స్థానిక విద్యార్థులతో వ్యాసరచన పోటీలు నిర్వహించి అవగాహన కల్పించారు పోటీలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు డిక్షనరీలు ఎగ్జామ్ ప్యాడ్స్ కంపాస్ బాక్సులు అందజేశారు ఈ కార్యక్రమంలో అటవీ క్షేత్ర అధికారి రాయికల్ టి భూమేష్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ పద్మ ఎఫ్ ఎస్ ఓ రత్నమ్మ,శ్రీనివాస్ బీట్ ఆఫీసర్లు రమణారెడ్డి,రత్నాకర్,సంధ్య,కవిత విజయ ఇలియాజ్ మరియు బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు

## మంత్రిని కలిసిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్



**నవగీతం,జూన్04,(జగిత్యాల ప్రతినిధి ):** జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం నిధుల మంజూరుపై జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ చీఫ్ ఇంజనీర్ మోహన్ నాయక్, చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వరరావులను మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధి పనులపై చర్చించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర రోడ్లు--భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశాల మేరకు జగిత్యాల నియోజకవర్గంలో సుమారు రూ.65 కోట్ల వ్యయంతో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులకు నిధులను తక్షణమే మంజూరు చేయాలని ఎమ్మెల్యే అధికారులను కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం, సంబంధిత అధికారులకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. అదేవిధంగా, జగిత్యాల నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి పనుల కోసం దాదాపు రూ.100 కోట్ల నిధులను మంజూరు చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వెల్లడించారు. త్వరలోనే జగిత్యాల పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు, రోడ్ల విస్తరణ పనులు, మరమ్మతులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ నిధులతో నియోజకవర్గంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడి ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## ఈవీఎంల భద్రతకు అత్యంత ప్రాధాన్యత

జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్




**నవగీతం, జున్04,(జగిత్యాల ప్రతినిధి ):** ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, విశ్వసనీయతను కాపాడడంలో ఈవీఎంల భద్రత అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. సత్యప్రసాద్ అన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు దరూర్ క్యాంపులోని ఈవీఎం గోదామును గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి నెలా ఈవీఎం గోదాములను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తున్నామని తెలిపారు. గోదాములో భద్రపరిచిన యంత్రాల భద్రత, సీసీ కెమెరాల పనితీరు, సాంకేతిక వ్యవస్థల పనితీరును సమగ్రంగా పరిశీలించినట్లు చెప్పారు. ప్రస్తుతం గోదాములో అన్ని భద్రతా ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేసిన కలెక్టర్, గోదాము వద్ద పటిష్ట భద్రతా చర్యలు కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ గోదామును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఎన్నికల సామగ్రి భద్రతను అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించడం తమ బాధ్యత అని ఆయన అన్నారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జగిత్యాల అర్బన్ ఎమ్మార్వో రామ్మోహన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

**వార్డు సభలను విజయవంతం చేయాలి: అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్**



నవగీతం, జాన్04,(జగిత్యాల ప్రతినిధి) : ప్రజాపాలన--ప్రగతిపాలన కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వార్డు సభలను విజయవంతంగా పూర్తి చేసి ప్రజల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ అధికారులను ఆదేశించారు. జగిత్యాల మున్సిపల్ పరిధిలో నిర్వహించిన వార్డు సభ సమావేశంలో ఆయన పాల్గొని ప్రజల సమస్యలు, అభివృద్ధి అవసరాలు, సంక్షేమ పథకాల అమలుపై ప్రజల నుంచి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించారు. ప్రజల భాగస్వామ్యంతో స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కరించడమే వార్డు సభల ప్రధాన ఉద్దేశ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్, కౌన్సిలర్లతో కలిసి సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి పౌరుడికి సమర్థవంతంగా చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. వార్డు పరిధిలోని మౌలిక వసతులు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ తదితర అంశాలపై ప్రజలతో చర్చించారు. సమావేశంలో ప్రజలు అందజేసిన వినతులు, ఫిర్యాదులను సంబంధిత శాఖల ద్వారా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలో వార్డు సభలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

**మిల్లులకు చేరిన ధాన్యాన్ని 24 గంటల్లో అన్లోడింగ్ చేయాలని కలెక్టర్ ఆదేశం**

**నవగీతం,జూన్04( జగిత్యాల ప్రతినిధి) :** జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వరి ధాన్యం సేకరణ ప్రక్రియ పర్యవేక్షణలో భాగంగా కథలాపూర్



మండలంలోని కలికోట గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం చేయకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని సూచించారు. రైతులు తమ పంటను విక్రయించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ధాన్యం తూకం, నిల్వ, రవాణా వంటి అంశాల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని, రైతులకు మెరుగైన సేవలు అందేలా చూడాలని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన డేటా ఎంట్రీని వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి రైతుల ఖాతాల్లో సకాలంలో నగదు జమ అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మిల్లులకు తరలించిన ధాన్యాన్ని 24 గంటల్లోపు అన్లోడింగ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లుల వరకు ఎక్కడా జాప్యం లేకుండా ప్రక్రియ కొనసాగాలని, రైతుల శ్రమకు తగిన ప్రతిఫలం సకాలంలో అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో, డీటీవో, డీసీఎస్‌వో, తహసీల్దార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

నవగీతం
తెలుగు దినపత్రిక

శుక్రవారం
5 జూన్ 2026

## ఘనంగా పెద్దమ్మ తల్లి పండుగ




**నవగీతం, జూన్04, (రాయికల్ ప్రతినిధి)** రాయికల్ మండలం మైతాపూర్ గ్రామములో గురువారం రోజున గ్రామ దేవత అయిన పెద్దమ్మ తల్లి పండుగను గ్రామంలో ఉన్న అన్ని కులాలకు చెందిన కుల పెద్దలు అన్ని సంఘల అధ్వర్యం లో ఆయా సంఘాల అద్యక్ష కార్యదర్శుల సభ్యులు అందరూ కలిసి డప్పు చపులతొ గొర్రె పొట్టేళ్ళు తో గ్రామంలో ఉన్న పోరుమల్ల రోడ్డు లో ఉన్న పెద్దమ్మ తల్లి ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించారు. ముందుగా యాదవ సంఘం ఆధ్వర్యంలో పోయిన వారం రోజుల క్రితం కుమ్మరి పెల్లి గ్రామంలో ఉన్న పెద్దమ్మా తల్లి వద్దకి వెళ్ళి అక్కడ మొక్కులు తీర్చుకొని వచ్చిన వారం రోజుల తరువాత మైతాపూర్ లో పెద్దమ్మ తల్లి పండుగ జరుపుకుంటారు.గ్రామంలో అందరూ కలిసి కట్టుగా ఉండాలని పిల్ల పాపలు చల్లగా ఉండాలని వ్యవసాయం పాడి పశువులు అభివృద్ధి చెందాలని ఇతర కుల వృత్తులకు ఎలాంటి ఆటంకాలు జరగకుండా చూడాలని కోరుకుంటు పండగ జరుపుకుంటారు.

## తెలంగాణ రక్షణ సేన జెండా పండుగ

### రాయికల్ మండల కేంద్రంలో జండా ఆవిష్కరణ




**నవగీతం, జూన్04( రాయికల్ ప్రతినిధి):** రాయికల్ మండల కేంద్రంలోని తెలంగాణ రక్షణ సేన జెండా పండుగలో భాగంగా జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జ్ పునుగోటి పవన్ రావు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్టేట్ అబ్జర్వర్ మాధవి మరిపెల్లి ,జిల్లా ఇంఛార్జ్ చెర్లపల్లి అమర్‌దీప్ గౌడ్ముఖ్య అతిథులుగా హాజరై జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన నాయకులు నీలగిరి రాజేందర్,నందు నాయక్, ముహమ్మద్ ఇంతియాజ్,మాదాడి పురుషోత్తం రావు,శ్రీకర్ ,వొద్దినేని వెంకటేష్ ,రిజ్వాన్, సుజాత,యుగేందర్, రమేష్, రవీందర్ నాయక్,రవి,మ్యాక మారుతి, వేణు, వంశీ, నరేందర్, ప్రసాద్, ప్రదీప్, సునీల్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## విద్యారంగంలో విశిష్ట సేవలు
## వెల్మ నవీన్ రెడ్డి కి గౌరవ డాక్టరేట్..







**నవగీతం, జూన్04,( జగిత్యాల ప్రతినిధి).** జగిత్యాల పట్టణంలోని బచ్ పన్ అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్, కరెస్పాండెంట్, వల్లంపల్లి మాజీ సర్పంచ్ వెల్మ సమత నవీన్ రెడ్డి కి విద్యారంగంలో అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా అమెరికాలోని మేరీ ల్యాండ్ స్టేట్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ నగరంలో నిర్వహించిన 36వ వరల్డ్ స్కూల్ సమ్మిట్ కార్యక్రమంలో ఈ ప్రతిష్టాత్మక గౌరవాన్ని భారత ప్రముఖ ఒలింపిక్ పతక విజేత రెజ్లర్ సాక్షి మాలిక్ చేతుల మీదుగా నవీన్ రెడ్డి స్వీకరించారు.విద్యా రంగంలో వినూత్న విధానాలు అమలు చేస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో ఆయన చేస్తున్న కృషిని గుర్తిస్తూ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా వెల్మ నవీన్ రెడ్డి మాట్లాడుతూ, “ఈ గౌరవం నా బాధ్యతను మరింత పెంచిందనీ, ఈ ప్రయాణంలో నన్ను ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.భవిష్యత్తులో కూడా బచ్ పన్ అకడమిక్ హైట్స్ పాఠశాలల ద్వారా జగిత్యాల పట్టణానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావడానికి మరింత కృషి చేస్తాననీ అన్నారు.ఈ అరుదైన గౌరవం లభించడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నవీన్ రెడ్డి కి అభినందనలు తెలిపారు.

# అందరి సహకారంతో మున్సిపాలిటీ అభివృద్ధి చేస్తా





### మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ
### 12వ వార్డు సభలో పాల్గొన్న కౌన్సిలర్ మాదినేని సునీత కమిషనర్ రామచంద్రరావు

**నవగీతం,జూన్04 (వైరా ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అంశంపై 12 వార్డులో వార్డు సభ నిర్వహించారు ఈ వార్డు సభకు వార్డు సభ్యురాలు కౌన్సిలర్ మాదినేని సునీత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ హాజరయ్యారు. వార్డ్ లో ఉన్న సమస్యలను ఈ వార్డు సభ్యులు అధికారుల దృష్టి తీసుకుని వచ్చి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు అందరి సహకారంతోనే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని ఆమె తెలిపారు. ప్రజల సహకారంతోనే అన్ని సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఆమె సందర్భంగా పేర్కొన్నారు వార్డు సభకు మున్సిపల్ కమిషనర్ మేడూరు రామచంద్రరావు పాల్గొని మాట్లాడుతూ రాబోయే వర్షాకాలంలో మురుగునీటి కాలువలు శుభ్రపరచుట కోసం ప్రణాళిక సిద్ధం చేశామని వార్డులో ఉన్న వీధిలైట్లు దగ్గర నుండి తడి చెత్త పొడి చెత్త సేకరించే విధంగా అన్ని విధాల చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలిపారు. ప్రజాపాలన ప్రగతిప్రణాలిక కాంశంపై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలలో అధికారులు కౌన్సిలర్లు మమేకమై వార్డులో ఉన్న ప్రతి సమస్యను దీర్ఘకాల దృష్టితో పరిష్కరించేందుకు కృషి చేశారని ఈ సందర్భంగా తెలిపారు. ప్రతి వార్డులో వార్డు సభలు ఈనెల 10వ తారీఖు వరకు జరుగుతాయని ఆయా వార్డులో ఉన్న సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తామని ఆయన తెలిపారు ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటానని మీ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా మీ ముందు ఉంటానని అవసరమైతే క్షేత్రస్థాయిలో కూడా వచ్చి పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తారని ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత మాట్లాడుతూ వార్డులో ఉన్న ప్రతి సమస్యకు పరిష్కరించే దిశగా అన్ని విధాల ముందు ఉంటానని ఎవరికైనా పింఛన్లు గాని రాని ఎడల వారు గతంలో పెట్టిన వారు కాకుండా కొత్తగా కావలసినవారు దరఖాస్తులు చేసుకోవచ్చని సందర్భంగా పేర్కొన్నారు. వార్డులో దీర్ఘకాలికంగా డ్రైనేజీ వ్యవస్థ గురించి వీధిలైట్లు కొన్ని చోట్ల వెలగడం లేదని తడి చెత్త పొడి చెత్త వ్యాను ప్రతిరోజు వార్డులోకి అందుబాటులోకి రావటం లేదని కౌన్సిలర్ దృష్టికి తీసుకువచ్చారు సమస్యలను పలువురు విన్నవించుకున్నారు. గ్రామ సభను అధికారులు 20 నిమిషాల్లో ముగించడం పట్ల వార్డు ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. సమస్యలను విన్నవించుకోవటానికి సంబంధిత అధికారి లేకపోవడం పట్ల నిరసన వ్యక్తం చేశారు వార్డులో హెల్త్ క్యాంప్ నిర్వహించి బీపీ పరీక్షలు వార్డు ప్రజలు కావలసిన మందులను అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు వార్డు అధికారి వార్డు సభ్యులు అంగనవాడి సూపర్వైజర్ బుడిగి సునీత హెల్త్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు

# ఇసుక తవ్వకాలపై కఠిన నిఘా..

## వర్షాకాలం తర్వాతే రీచ్‌ల గుర్తింపు: కలెక్టర్ బి. సత్యప్రసాద్




**నవగీతం, జూన్04,(జగిత్యాల ప్రతినిధి) :** జిల్లాలో ఇసుక రీచ్‌ల గుర్తింపు, తవ్వకాలపై క్షేత్రస్థాయి అధ్యయనాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. వర్షాకాలం అనంతరం ఇసుక నిల్వ ప్రాంతాలపై భూగర్భ జల శాఖ ద్వారా సమగ్ర అధ్యయనం నిర్వహించి, భవిష్యత్తులో తవ్వకాలకు అనువైన ప్రాంతాలను గుర్తించాలని సూచించారు.జిల్లా స్థాయి ఇసుక సమన్వయ కమిటీ (డీఎల్ఎస్‌సీ) సమావేశం గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధ్యక్షతన, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సమక్షంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లాలో ఇసుక నిల్వ ప్రాంతాల గుర్తింపు, భూగర్భ జల శాఖ సాధ్యాసాధ్యాల నివేదికలు, స్థానిక అవసరాలు, ప్రభుత్వ పనుల కోసం ఇసుక అందుబాటు అంశాలపై సమీక్ష నిర్వహించారు.సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జగిత్యాల జిల్లాలో ఇసుక రీచ్‌లు అందుబాటులో లేవని తెలిపారు. వర్షాకాలం ముగిసిన తర్వాత పరిస్థితులను సమీక్షించి ఇసుక లభ్యత ఉన్న ప్రాంతాలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. భూగర్భ జల శాఖ నివేదికల ఆధారంగా శాస్త్రీయ అధ్యయనాలు నిర్వహించి తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బలహీన వర్గాల గృహ నిర్మాణాల కోసం మినహా అన్ని ఇసుక లావాదేవీలు ఆన్‌లైన్ విధానంలోనే జరగాలని స్పష్టం చేశారు. ఇసుక తవ్వకం, రవాణా, విక్రయాల్లో పూర్తి పారదర్శకత పాటించాలని, నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.ధర్మపురి మండల పరిధిలో గోదావరి నదిలో ప్రస్తుతం ఎటువంటి అధికారిక ఇసుక తవ్వకాల అనుమతులు లేవని కలెక్టర్ వెల్లడించారు. అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు, రవాణా జరగకుండా రెవెన్యూ, పోలీసు, గనుల శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అలాగే గోదావరి పరివాహక ప్రాంతంలో అనువైన ఇసుక నిల్వ ప్రాంతాలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇబ్రహీంపట్నం నుంచి గోదావరి నది పరిధిలో అనువైన ఇసుక రీచ్‌లను గుర్తించి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం తెలంగాణ గనుల అభివృద్ధి సంస్థకు అప్పగించే ప్రక్రియను చేపట్టాలని కలెక్టర్ సూచించారు.సమావేశంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, అదనపు కలెక్టర్ బి.ఎస్. లత, ఆర్డీవోలు మధుసూదన్, జి. నర్సింహారావు, దివాకర్ రెడ్డి, జిల్లా భూగర్భ జల అధికారి శ్రీకాంత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఈ. మురళి, గనులు మరియు భూగర్భశాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ప్రజల సహకారం అవసరం
## -వైరా చైర్ పర్సన్




**నవగీతం,జాన్04, (వైరా ప్రతినిధి):** వైరా మున్సిపాలిటీ పరిధిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అంశంపై 12 వార్డులో వార్డు సభ నిర్వహించారు ఈ వార్డు సభకు వార్డు సభ్యురాలు కౌన్సిలర్ మాదినేని సునీత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ హాజరయ్యారు. వార్డ్ లో ఉన్న సమస్యలను ఈ వార్డు సభ్యులు దృష్టి తీసుకుని వచ్చి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు అందరి సహకారంతోనే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని ఆమె తెలిపారు. ప్రజల సహకారంతోనే అన్ని సమస్యలు పరిష్కరించుకోవచ్చని హామీ సందర్భంగా పేర్కొన్నారు వార్డు సభకు మున్సిపల్ కమిషనర్ మేడూరు రామచంద్రరావు మున్సిపల్ అధికారులు వార్డు అధికారి తదితరులు పాల్గొన్నారు

## ప్రారంభమైన గ్రామసభలు
## పాల్గొన్న మున్సిపాలిటీ ప్రజలు




**నవగీతం,జూన్04 (వైరా ప్రతినిధి):** వైరా మున్సిపాలిటీ పరిధిలో 6,9 వార్డుల యొక్క వార్డు సభ స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ నందు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని వారి యొక్క సమస్యలను, వినతులను తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, మున్సిపల్ కమిషనర్ ఎం రామచంద్రరావు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు, మున్సిపల్ మేనేజర్ సుధీర్ మరియు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు

## జూన్ 8న ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిస్ మేళా
## -- ఐటీఐ అభ్యర్థులకు ఉపాధి అవకాశాల కల్పన

**నవగీతం, జూన్04,(జగిత్యాల ప్రతినిధి):** ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు, జూలై--2026 పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిస్ మేళా ఈ నెల 8వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు ప్రభుత్వ ఏటీసీ నర్సింగపూర్, జగిత్యాలలో నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ గంట్యాల రవీందర్ తెలిపారు. ఈ మేళాలో వివిధ ప్రముఖ సంస్థల ప్రతినిధులు పాల్గొని అప్రెంటిస్‌షిప్ అవకాశాలను అందించనున్నారు.అప్రెంటిస్‌షిప్ చేయాలనుకునే అభ్యర్థులు అప్రెంటిస్‌షిప్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని, అప్రెంటిస్‌షిప్ రిజిస్ట్రేషన్ కాపీ, పదో తరగతి మెమో, ఐటీఐ పాస్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో మేళాకు హాజరు కావాలని సూచించారు. ఐటీఐలో అన్ని ట్రేడ్లు పూర్తి చేసిన వారు, అలాగే జూలై--2026 పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.యువతకు పరిశ్రమల్లో శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంతో ఈ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఎ. మహేశ్ (9666222621), ఎ. రవి (9885581498) లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## చిన్నారుల సంక్షేమమే సమాజ అభివృద్ధికి పునాది..
## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్..



**నవగీతం,జూన్04,(కోరుట్ల ప్రతినిధి):** మేడిపల్లి మండలం కేంద్రంలోని మాచాపూర్ గ్రామంలో రూ.12 లక్షలతో నిర్మించిన నూతన అంగన్వాడీ కేంద్రాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల సంక్షేమం, విద్య, పోషణ, ఆరోగ్య పరిరక్షణకు అంగన్వాడీ కేంద్రాలు కీలక భూమిక పోషిస్తాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులకు మెరుగైన వసతులు కల్పించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చన్నారు.రాష్ట్ర ప్రభుత్వం బాలల అభివృద్ధి, మహిళా సంక్షేమం, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. మాచాపూర్ గ్రామంలో నిర్మించిన ఈ నూతన అంగన్వాడీ కేంద్రం చిన్నారులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణాన్ని అందిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పేటెరీ రోజా నాగరాజు,ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు, మహిళలు, అంగన్వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

